# ఇది కథకాదు

పార్వతి పొన్నలూరి, Passaic, NJ

అది ఒక అందమైన ఉద్యానవనం. నవ్వే పువ్వులు, ఝుమ్మని మూగే తుమ్మెదలు, సన్నగా తోటనంత పెనవేసుకొని అల్లుకుంటున్న లతలు, తీవిగ, తమ శాఖల హస్తాల్ని చాచి ఆహ్వానిస్తున్న వృక్షరాజాలు, మధుర ఫలాల్ని ఆరగిస్తు అంతకంటే మధురంగ వనాన్ని అంతా పలుకరించే చిలక బాలలు, ఇంత అందాన్ని, ఆనందాన్ని అనుభవించాలంచే సంగీతం లేకుండా సాధ్యమా! అన్నట్లు పోటీలు పడి రాగాలు తీసే కోయిలమ్మలు, అన్ని రంగులను ఎలా సంతరించూకొన్నాయో చిన్ని పిచ్చుకల మేమేం తక్కువ అంటు ఒక్క క్షణం విశ్రాంతి లేకుండా వనాన్నంతా అలంకరిస్తున్నాయి.

అంత అందమైన వనంలోకి ఎన్నెన్నో సాగరాలు మరెన్నో పర్వతాలు దాటి జంటను వెదుక్కుంటూ ఒక చిన్నారి కోయిల అడుగు పెట్టింది. వృక్ష రాజాలు నిండైన హృదయంతో ఆహ్వానించాయి. మా అందం అంతా నీకే అంటూ పూదీవలు సొంపుగ నవ్వాయి. ముద్దు ముద్దుగ పలికించాయి చిలక బాలలు. తనకు మరో నేస్తం దొరికింది అంటూ ఆనందంతో పులకించి మరింత మత్తుగ రాగాలు తీసాయి కోయిలమ్మలు. ఆ పరవశంలో ఈ చిన్నారి కోయిల తాను కూడ రాగాన్ని ఆలాపించి శృతిని మేళవించ బోయింది.

అలవోకగ ప్రియుని ఆలోకించింది. అతని కన్నుల కురిసే బడబాగ్నికి భయపడి చిన్నారి కోయిల దూరంగ జరిగింది. రాగం పైకి రాలేదు. కత్తి వేటుకి గొంతు నరాలు. తెగినట్లు రాగాలకు బదులు రక్తాన్ని స్రవిస్తున్నాయి. కన్నీటి మడుగులో తడిసిన గుండె చైతన్యాన్ని కోల్పోయింది. శాస్త్రోక్తంగా శరీరాన్ని, మంత్రాల బాసలలో మనసుని అర్పించుకొన్న, తాను నమ్మిన తోడు శాస్త్రాలు, మంత్రాల వరకే పరిమితం అయింది. ప్రియుని హృదయాన్ని ప్రేమగ స్పర్శించాలని ఆశగ ఏ మూలనో మిగిలిన మమతలు దీపాలు వెలిగించింది. తుఫాను గాలికి దీపాలు ఆరిపోయాయి. ఎక్కడ చూసినా చీకటి. అజ్ఞానంలా. అంత వరకు చదివి ఇక చదవలేనట్లు అసహనంగ కాగితాలను పక్కన పెట్టింది వైజయంతి. సాహితీ! ఈ కథను ఏ పత్రికకైనా పంపించావా! అడిగింది వైజయంతి.

లేదు విజ్జి! పంపించాలని రాయ లేదు. అమెరికా వచ్చింతర్వాత ఇలా రాయాలనిపించినప్పుడల్లా రాస్తున్నాను. కాని ఏ పత్రికకు పంప లేదు, ముభావంగా అంది సాహితి.

సాహితి, వైజయంతి ఇండియాలో మంచి స్నేహితులు. ఇద్దరూ చదివిన చదువులు వేరయినా, ఆలోచించే విధానం, అభిప్రాయాలు ఒక్కటే. వారిద్దరి కుటుంబాల మధ్య గల స్నేహం కూడ వారి స్నేహాన్ని మరింత బల పరిచింది. వైజయంతి కంప్యూటర్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. అమెరికాలో పి.హెచ్.డి. సీట్ వచ్చింది. సంప్రదాయ వాదులైన తల్లి తండ్రులు ఆడపిల్లలను అంత దూరం పంపించడం ఇష్టం లేక బాధ పడ్డారు. అయినా వైజయంతి తల్లి తండ్రులకు నచ్చ జెప్పి అమెరికాలో పి.హెచ్.డి. చేస్తున్నది. సాహితి బి.కాం. చదివింది. సాహితి తల్లి మ్యూజిక్ స్కూల్ నడుపుతున్నారు. చిన్న తనంనుండే సాహితి సంగీతంలో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించింది. మధురమైన తన కూతురి కంఠం వింటు ఆమె తల్లి సాహితి చేత కచేరీలు చేయించాలని ఆశ పడేది. ఇంట్లో అందరు సాహితిని పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యమని అన్నారు. కాని సాహితి బి.కాం. అయింతర్వాత చదువు ఆపేసి తల్లికి మ్యూజిక్ స్కూలులో సహాయ పడడం ప్రారంభించింది. తరచుగ ఆల్ ఇండియా రేడియో, టి.వి.లో ప్రోగ్రామ్స్ ఇస్తుండేది. విద్వాంసుల దగ్గర సంగీతంలో మెలుకువలు తెలిసికొంటుండేది. ఒక రికార్డు కంపెనీ వారు ఆమె పాటలను క్యాసెట్‌లో ఆవిష్కరించారు. సంగీత రసానందం సాహితిలో చక్కని సాహిత్యాభిమాన్ని కలిగించింది. వైజయంతి అమెరికా వెళ్ళినా ఇద్దరూ ఉత్తరాల ద్వారా పలకరించుకొనే వారు. ఉత్తరాల విషయంలో వైజయంతి బద్ధకం తెలిసిన సాహితి తానే ఎక్కువగ రాస్తుండేది. సాహితి పెండ్లి వార్త వినిన వైజయంతి సంతోషానికి హద్దులలేవు. పెండ్లి వార్త కంటే వరుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు అనే వార్త వైజయంతికి అంత సంతోషం కలిగించింది. 'నీ పెండ్లికి రాను. పెండ్లి అయి అమెరికా వస్తావు గదా! అప్పుడు అమెరికా లోనే కలుస్తాను.' అని ఉత్తరం రాసింది వైజయంతి. అనుకున్నట్లు సాహితి అమెరికా వచ్చి అప్పుడే ఎనిమిది నెలలు నిండుతూన్నాయి. సాహితి అమెరికా వస్తే హాయిగ రెండు రోజుల కొసారి ఫోన్‌లో మాట్లాడుకోవచ్చు. సంవత్సరానికి రెండు సార్లు కలవచ్చు, అనుకున్న వైజయంతికి ఆశ్చర్యం ఒకటే మిగిలింది. ఎనిమిది నెలలలో ఒక్కసారి కూడ సాహితి వైజయంతికి ఫోన్‌కాల్ చేయ లేదు. వైజయంతి ఫోన్ చేసినప్పుడు నేను బాగున్నాను, అంతా బాగనే ఉంది, నువ్వెలా ఉన్నావు? అని అడగడం, వైజయంతి చెప్పిన మాటలు వినడం జరుగుతుండేది. కొత్త పరిసరాలు, కొత్త మనుషులు కదా అని వైజయంతి సమాధాన పడడానికి ప్రయత్నం చేసింది. మొత్తంమీద వేసవి సెలవలలో సాహితిని కలవగలిగుంది వైజయంతి. వచ్చి రెండు రోజులయింది. కనిపిస్తే గలగల మాట్లాడడం, కదిలిస్తే రాగాలు తీసే సాహితి ఇంత మౌనంగ ఎందుకు మారిందో మొదటి రోజు అర్థం కాలేదు వైజయంతికి. ఏదైన నోరు విప్పి అడుగుదామంటే సాహితి అత్తగారు గూఢచారిలా వారిద్దరి పక్కనే ఉండడం వైజయంతికి ఇబ్బంది కలిగించింది. సాయంత్రం ఆరు గంటలు కాగానే సాహితి భర్త శ్రీనివాస్ వచ్చేస్తాడు. రాగానే ఒక గంట టి.వి. చూస్తాడు. తరువాత అందరు భోజనాలు చేస్తారు. అతను అతని గదిలోకి వెళ్ళిపోతాడు. ఈ రెండు రోజులలో సాహితితో అతను ఒక్క మాట మాట్లాడడం కాని, నవ్వడం కాని చూడలేదు వైజయంతి. సాహితి ప్రవర్తన చూసి మోదట ఆశ్చర్యపోయినా, ముంజేతి కంకణానికి అద్దం ఎందుకన్నట్లు, కారణాలు భూతాల్లా పెద్దవిగ కనిపిస్తూనే ఉన్నాయి. ఫలితం, సాహితి పడుతున్న చిత్రహింస కూడ తెలుస్తున్నది. వారం రోజుల వెకేషన్‌లో మూడు రోజులయిపోయాయి. మిగిలిన మూడు రోజులలో తన స్నేహితురాలికి తానేం చేయగలదు. వైజయంతి ఆంధోళన అధికమయింది. ఆ రోజు సాహితి అత్తగారు తలనొప్పిగ ఉందని మధ్యాహ్నం పెందలాడే తమ గదిలోకి వెళ్ళారు. సాహితి తాను రాసిన రచనలను వైజయంతికి చూపిస్తున్నది.

ఉపోద్ఘాతాలకి కూడ సమయాన్ని వృధా కానీయకుండా సాహితీ! నీ జీవితంలో ఏమి జరుగుచున్నది! నాతోనయినా కనీసం చెప్పక పోతే వేల మైళ్ళ దూరంలో ఉన్న మీ వాళ్ళకు ఎలా చెప్పగలవు? సూటిగ అడిగంది వైజయంతి. వైజయంతి ప్రశ్నకు సాహితి శోకం కట్టలు తెంచుకొన్నది. వైజయంతి ఆపే ప్రయత్నం చేయలేదు. ఉవ్వెత్తున అలలు ఎగసి పడుతుంటే అడుగున నిమ్నోన్నతాలు కనిపించవని ఆమెకు తెలుసు. కొద్ది సేపటికి నోరు విప్పసాగింది సాహితి. సారాంశం... శ్రీనివాస్‌కి ఇష్టం లేకుండా పెద్దవాళ్ళను కాదనలేక సాహితిని పెళ్ళి చేసుకున్నాడు. అతను సాహితికి శారీరకంగాను, మాననసికంగాను దగ్గరకు రావడానికి ఏ విధమైన ప్రయత్నము చేయడం లేదు. కనీసం స్నేహితుడుగా కూడా ప్రవర్తించడం లేదు. మామూలుగా కాని, నవ్వుతూ గాని మాట్లాడడం అతనికి అసలు రాదు, కాని నువ్వేమి సంపాదించడం లేదు, నా మీద నువ్వు ఆధారపడి ఉన్నావు అని చాలా సులభంగా అంటాడు. సాహితి ఏమాత్రం పరిస్థితులు మారడానికి ప్రయత్నం చేసినా నీకు అంతగా ఇష్టం లేక పోతే ఇండియా వెళ్ళు అనడానికి సిద్ధంగా వున్నాడు. సాహితిలా అత్తగారు, మావగారు కూడ నిస్సహాయులు. అంత నిస్సహాయతలోనూ అవకాశ వాదన్ని విడనాడకుండా కొడుకుని ఏదైనా అనవలసిన సమయాలలో కోడలని అంటూ ఉంటారు.

విజ్జీ! విమానం దిగి ఇంటికి వచ్చాను. ఎనిమిది నెలలు అవుతున్నది. మళ్ళీ గడప దాటి పాదం బయట పెట్టలేదు. అమ్మ నాన్నలకు ఉత్తరం రాయాలంటే ప్రతిసారి ఒక యజ్ఞం చేసినంత పని. వాళ్ళు ఎయిరోగ్రామ్ ఇస్తే రాయాలి. లేక పోతే లేదు. స్వేచ్ఛకు మారు పేరు అమెరికా

అంటారు. ఇక్కడ నాకు కనీసం పోస్టాఫీసు కూడ దగ్గరలో లేదు. కనీసం నాకు ఫోన్ కాల్ చేయడానికి కూడ కుదరదు. నేను ఫోన్ చేయక పోయే సరికి రూపాయల్లో ఎంతో ఖరీదు అయినా అమ్మా వాళ్ళే అప్పుడప్పుడు ఫోన్ చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడం గురించి మాట్లాడినా, చదువు గురించి అడిగినా వింత జంతువును చూసినట్లు చూస్తున్నారు. నాకంటూ ఒక అస్తిత్వం లేదు. నిస్సహాయురాలిలా మాట్లాడుతోంది సాహితి. ఏ తప్పు చేసానని భగవంతుడు నన్నిలా చిత్ర హింస పెడుతున్నాడు? అని ప్రశ్నిస్తున్న సాహితికి వైజయంతి సమాధానమేమియగలదు. కనిపించే మానవుడుని, కారణ భూతుడైన మానవుడిని ప్రశ్నించి సమాధానం రాబట్టలని మనం కనిపించని భగవంతుడిని ఏమని ప్రశ్నించగలము? అడిగి మన మీద మనం జాలి పెంచడం తప్ప. శారీరకంగాను మానసికంగాను భర్త అనబడే వానితో సంబంధం లేకుండ, క్షణం ఓదార్పు, అరక్షణం చిరునవ్వు లభించని జీవితంలో సాహితిని చూసి తట్టుకోలేక పోయింది వైజయంతి. సాహితి గుర్తొకొచ్చినప్పుడల్లా అదృష్టవంతురాలు, ఎవరిని పెండ్లి చేసుకున్నా వారి జీవితం ఆనందమయం, అని అనుకుంటుండేది వైజయంతి. అంత గుణవంతురాలు సాహితి. పుట్టుకతో తనకు లభించిన టాలెంట్స్‌కి మెరుగులు దిద్దుకుంటూ పెండ్లి అయే వరకు ఎంతో హాయిగ, ఆనందంగ సమస్యలంటే ఏమిటో తెలియని స్థితిలో పెరిగింది. అంత మాత్రాన సాహితి అసమర్దురాలు కాదు. పరాయి దేశంలో 'నా' అన్న వాళ్ళు లేక, ఆర్థిక స్వేచ్ఛ లేక, ఎక్కడికీ వెళ్ళలేక, ఎవరితోను చెప్పుకోలేక, నిస్సహాయురాలైె.

సాహితీ! పెళ్ళికి ముందు మీ ఇద్దరూ ఒక్క మాట కూడా మాట్లాడుకో లేదా?

లేదు. అన్నట్లు తల అడ్డంగా తిప్పింది. అత్తయ్యగారు వాళ్ళు, అమ్మ వాళ్ళకు బాగ తెలుసు. మా వాళ్ళు నా అభిప్రాయం అడిగారు. శ్రీనివాస్ మంచి వాడు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. అబ్బాయి తల్లి తండ్రులు మాకు బాగా తెలుసు. అసలు మా అంత మేము ఈ సంబంధం గురించి విచారించ లేదు. కట్నం ఎంత అడుగుతారో అని. కాని ఇప్పుడు వాళ్ళంతట వాళ్ళే మన కుటుంబం నచ్చి నిన్ను కోడలిగ చేసుకోందామని అడుగుతున్నారు. మాకు సంబంధం నచ్చినా తుది నిర్ణయం నీదే, అని అమ్మ నాన్న అన్నారు. విజ్జీ! నా విషయం నీకు తెలుసు. పెండ్లి విషయంలో ఎందుకో నా సెలక్షన్‌పై నా కంతగ నమ్మకం లేదు. అందుకే పెద్దవాళ్ళకు వదిలేసాను. అయినా విజ్జీ! ఇందులో ఎవరి తప్పు లేదు. ఇదంతా నా దురదృష్టం. ఎంతగ సహించి బ్రతుకుదామన్నా పాషాణంలా బ్రతకడం మాత్రం నావల్ల కావడం లేదు.

సాహితీ! సమస్య చిన్నదైనా, పెద్దదైనా, భయంకరమైనదైనా పరిష్కారమార్గం నువ్వే వెతుక్కోవాలి. ఇలా చెయ్యి, అలా చెయ్యి అని నేను చెప్తాను. ఆ మార్గాలు నీవున్న పరిస్థితులకు అనుకూలంగా ఉండక పోవచ్చు. కొన్ని సమయాలలో ఇతరులు చెప్పినట్లు చెయ్యడం వలన కొత్త సమస్యలు రేకెత్తవచ్చు. అతనిలో మార్పు వస్తుందని నీకు నమ్మకం ఉన్నదా? సూటిగా అడిగింది వైజయంతి.

ఇప్పటికి అలాంటి ఆశా భంగాలు చాలాసార్లు అనుభవించాను. ఇప్పుడిక ఆశతో కాదు. కర్తవ్యం అనుకొని ప్రయత్నించాలి. విరక్తిగ అన్నది సాహితి.

సాహితీ! నువ్వు ఉద్యోగం ఎందుకు చేయకూడదూ! ఉద్యోగం ఎంత చిన్నదైనా సరే ముందు మొదలుపెట్టి తరవాత చదువుకోవచ్చు. కొత్తగ కోర్సులు ఏవైనా చెయ్యొచ్చు. సాలోచనగ అన్నది వైజయంతి.

ఆ విషయంలోను గొడవలైనాయి. నా ముఖం చూసి ఎవరూ ఉద్యోగం ఇవ్వరట. ఇది నా భర్తగ పిలవబడుతున్న అతని స్టేట్‌మెంట్. ఇంట్లో ఉన్న ఈ ముగ్గురిని ఎదిరించి ఉద్యోగం చేసినా సమస్య పరిష్కారమవుతుందా? అనిపిస్తున్నది. నిరాశగ అన్నది సాహితి.

లాలనగ సాహితి భుజంపై చెయ్యి వేసి చూడు సాహితీ! ఇంత కాలంగ ఈ ఇంట్లో ఉంటున్నావు. వాళ్ళ బలహీనతలు, మొండితనాలు, అజ్ఞానం నీకు తెలిసినంతగ నాకు తెలియవు. ఒకటి మాత్రం నిజం నాకు తెలిసినంత మటుకు ప్రతి సమస్యకు ఒక చోట పరిష్కార మార్గ ముంటుంది. అందుకే మొదట చెప్పాను. బాధను నువ్వు అనుభవిస్తున్నావు. ఆ మార్గమేదో నువ్వే కనిపెట్టాలి. ఎదుటివాళ్ళు చెప్పే మార్గాలు ఎప్పుడూ సాక్షికాలే కాని సర్వస్వాలు కావు. కృత నిశ్చయంతో, నీలో నుండి బయలు దేరే ఆలోచనలే ఇప్పుడు కావాలి. ఏదైనా ఒకటి చెయ్యడం మాత్రం అవసరం. ఏమి చెయ్యకుండ ఇలా గడిపితే నీకు పిచ్చి రావడం మాత్రం నిజం. గట్టిగ అన్నది వైజయంతి.

నిజమే విజ్జీ! నీ మాటలు వింటుంటే చనిపోతున్న నా అస్తిత్వాన్ని బ్రతికించు కోవాలనిపిస్తున్నది. ఇటువంటి వైవాహిక జీవితాన్ని నేనెప్పుడూ ఊహించ లేదు. చూశావా విజ్జీ! డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగం, చదువు ఇలా ప్రతి ఒక్కదానికి యుద్ధం చేయాలి. అంతెందుకు మనిషిగ అతనికి బ్రతకడం రాకపోయినా, అలా బ్రతకడానికి నేను చేసే ప్రతి ప్రయత్నానికి యుద్ధం చేయాలి. ఇంతకాలం ఇంటి నాలుగు గోడల మధ్య మగ్గుతూ మార్పు కోసం ప్రయత్నించాను. ఇక నుండి నా మార్పు నేను అన్వేషించడానికి వెలుపలి వెలుగు కోసం అడుగు బయట పెడతాను. కృశిస్తున్న ఆత్మ విశ్వాసాన్ని ప్రాణం పోస్తూ మాట్లాడుతున్నది సాహితి.

ఉద్యోగాలకి ఎలా ప్రయత్నం చేయాలో, భవిష్యత్తులో ఏ సమస్యలు వచ్చినా, ఏ ఏ డాక్యుమెంట్స్ దగ్గర ఉంచుకోవాలో అన్నీ వివరంగా చెప్తున్నది వైజయంతి, సాహితి శ్రద్ధగా వింటున్నది.

ఉద్యానవనంలో తోటి కోయిలమ్మ ఓదార్పుగా చిన్నారి కోయిల బాధ నుండి తేరుకొంటున్నది. ఇప్పుడిప్పుడే లోకాన్ని రాగరంజితం చేయలేకున్నా, జీవితంతో పోరాడడానికి సంసిద్ధమవుతున్నది.

* * * * * * * * * * *

పాఠకులారా! ఈ రచన కల్పితం కాదు. పాత్రల పేర్లు, ముగింపు మాత్రమే కల్పితాలు. మాతృమూర్తి, మాతృదేశాన్ని వదిలి 'ఆమె' అమెరికా వచ్చింది. వచ్చినప్పటినుండి ఈ రోజు వరకు 'ఆమె' పరిస్థితిలో మార్పు లేదు. వైజయంతి లాంటి స్నేహితురాలు ఉన్నా ప్రస్తుతం సహాయం చేయలేని పరిస్థితిలో ఉన్నారు. సహాయం చేయలేక కాదు, ఇతరులకు చేసే సహాయం కొన్ని సమయాలలో కొత్త సమస్యలను, ప్రమాదాలను సృష్టించ వచ్చు. అందుకే పరిష్కార మార్గాలు 'ఆమె'లో నుండి బయలు దేరితే సహాయం చేయడానికి చిత్తశుద్ధి గల స్నేహితులు ఒకరిద్దరైనా ఉన్నారు.

ఈ కథ 'ఆమె'కే అంకితం. ఆమె జీవితంలో వసంతం చిగురించాలని, జీవితంలో పోరాడటానికి లోన శక్తి ఆమెకు కలగాలని ఆశిస్తూ...

